నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి

మదనపల్లె: మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయడమే కాక, వారికి చెల్లిస్తున్న వేతనానికి అదనంగా రూ.6 వేల వేతనం పెంచిన ఘనత గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. సోమవారం ఆమె అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 28 రోజులుగా దీక్షలు చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు తమ డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేయాలని చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మిక పక్షపాతిగా ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారన్నారు. వైస్ చైర్మన్ జింకా చలపతి మాట్లాడుతూ ఎన్నికల్లో పారిశుధ్య కార్మికులకు వేతనం పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చాక మరచిపోయారన్నారు. కార్మికులు విన్నవిస్తున్న వేతన పెంపును మున్సిపల్ నిధుల నుంచి చెల్లించేలా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని కోరారు. ప్రభుత్వం కార్మికుల పనిగంటలను పెంచడం అన్యాయమని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.12వేలు ఉన్న కార్మిక వేతనాలను రూ.18 వేలకు పెంచారని అన్నారు. కార్మిక బృందాల విధుల నిర్వహణ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వార్డుల్లో నెలకోసారైనా పనులు చేపట్టడం లేదన్నారు.



పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యంపై అధికారులను ప్రశ్నిస్తున్న చైర్‌పర్సన్ మనూజారెడ్డి

దీనిపై చైర్‌పర్సన్ మనూజ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటి నిధులతో టిప్పు సుల్తాన్ గ్రౌండ్‌లో పనులు ఎలా చేయిస్తారని ప్రశ్నించారు. మంత్రి నారాయణకు నెల్లూరు కార్పొరేషన్ తప్ప మరే మున్సిపాలిటి సమస్యలు కనిపించడం లేదన్నారు. తాగునీటి సమస్య ఎదుర్కొంటున్నా పట్టించుకోవడం లేదన్నారు. వైస్ చైర్మన్ నూర్ ఆజం మాట్లాడుతూ తన వార్డులో అభివృద్ధి పనులు జరగడం లేదని, దోమలు, కుక్కల బెడద అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అభివృద్ధి పనులు చేపట్టనున్నామని చైర్‌పర్సన్ మనూజ అన్నారు. ఏడాదిగా పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం మంజూరవుతున్నట్లు చెప్పారు. సమావేశం 30 నిమిషాలు ఆలస్యంగా మొదలవగా మధ్యలో 30 నిమిషాలను వాయిదా వేసిన చైర్‌పర్సన్ మళ్లీ సమావేశం నిర్వహించారు. దీనికి ముందు అహ్మదాబాద్‌లో విమాన ప్రమాద మృతులకు రెండు నిమిషాలు మౌనం పాటించిన కౌన్సిల్ సమావేశం నివాళులర్పించింది. కౌన్సిల్ మీట్‌లో అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

బి.కొత్తకోట: ఎస్సీకాలనీల్లో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని తహసీల్దార్ ఎ.బావాజాన్ అన్నారు. సోమవారం మండలంలోని బీరంగి దళితవాడలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. హాజరైన వారితో సమావేశం నిర్వహించి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకం అమలు, పక్కా గృహాల మంజూరు, వాటి నిర్మాణం, పెన్షన్ల మంజూరు తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు తమ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణవేణి, ఎంఈవో రెడ్డిశేఖర్, ఏపీఓ వెంకటేష్, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.

వాటర్‌మన్‌లకు వేతనాలు చెల్లించాలని వినతి

పీలేరు రూరల్ : పీలేరు పట్టణంలో ఆర్‌వో ప్లాంట్ల వద్ద పని చేస్తున్న వాటర్‌మన్‌లకు వేతనాలు చెల్లించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ లతీఫ్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద వాటర్‌మన్‌లు నిరసన తెలిపారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్‌మన్‌లకు గత 11 నెలలుగా జీతాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ పట్టించుకోలేదని తెలిపారు. తమకు జీతాలు ఇచ్చి ఆదుకోవాలని కోరరు. వాటర్ మెన్‌లు అశోక్, మురళీ, గౌస్‌బాషా, ప్రబురాజ్, షౌకత్‌అలి, రమేష్, ఖాదర్‌వలి, ఎంఎస్. నజీర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత జాబితా నుంచి నివాసస్థలం తొలగించండి

మదనపల్లె రూరల్ : ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసిన స్థలం నిషేధిత భూముల జాబితాలో ఉండటంతో, బ్యాంకర్లు రుణం మంజూరుచేయడం లేదని, నివాసస్థలాన్ని నిషేధిత జాబితా నుంచి తొలగించాల్సిందిగా కోరుతూ రంగారెడ్డి కాలనీకి చెందిన షేక్ నయీంఅక్తర్ అర్జీ సమర్పించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మదనపల్లె మండలం రంగారెడ్డి కాలనీకి చెందిన షేక్ నయీంఅక్తర్...మదనపల్లె రూరల్ గ్రామంలోని సర్వే నెంబర్.301–ఏలో ఇంటి నిర్మాణానికి 3 సెంట్ల స్థలం కొనుగోలుచేశానన్నారు. దానిపై బ్యాంకులో లోను తీసుకునేందుకు ప్రయత్నిస్తే.. ఆన్‌లైన్‌లో భూమి 22(ఏ)లో చూపిస్తోందని నిరాకరించారన్నారు. తమ భూమిని నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని కోరారు.

– ములకలచెరువు బురకాయలకోట గ్రామంలో తన తల్లి శ్యామలమ్మ పేరుపై ఖాతానెంబర్.351లో ఉన్నటువంటి ఆస్తిని నలుగురు కుమార్తెల పేరుపై మ్యుటేషన్ చేయాల్సిందిగా మదనపల్లె పట్టణం సప్తగిరినగర్‌కు చెందిన వై.స్వర్ణలత అర్జీ సమర్పించారు.

– రోడ్డుకు ఇచ్చిన స్థలం పోనూ, మిగిలిన భూమిలో ఇళ్లు నిర్మించుకుందామనుకుంటే అందులో 11 కేవీ. విద్యుత్ లైన్ వెళుతున్నందున కష్టతరంగా ఉందన్నారు. ములకలచెరువు, మదనపల్లె రోడ్డు విస్తరణకు ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారం తక్కువగా ఉన్నప్పటికీ అభివృద్ధికి సహకరించామని, ప్రభుత్వం తమపై దయ ఉంచి 11కే.వీ. విద్యుత్‌లైన్లను రోడ్డు వెంబడి వేసి న్యాయంచేయాల్సిందిగా కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లె పంచాయతీ సర్కార్‌తోపుకు చెందిన షేక్ ఖాదర్‌బాషా వినతిచేశారు.

వంటశాల నిర్మాణానికి రూ.3.40 లక్షల విరాళం

తంబళ్లపల్లె: మల్లయ్యకొండ కింద అన్నదానట్రస్టు నిర్మిస్తున్న వంటశాల నిర్మాణానికి కన్నెమడుగు మాజీ సర్పంచు శ్యామలమ్మ తనయులు రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డిలు రూ.3.40 లక్షలు విరాళంగా ఇచ్చారు. సోమవారం విరాళం చెక్కును అన్నదాన ట్రస్టు సభ్యులకు అందజేశారు. పెద్దిరెడ్డి కుటుంబీకులు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆధ్వర్యంలో మల్లయ్యకొండపై శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయ పునః నిర్మాణం చేసి ఎంతో కృషి చేశారన్నారు. దాతలకు ట్రస్టు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్యామలమ్మ సేవలు అమోఘం

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు మాజీ సర్పంచు శ్యామలమ్మ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ,వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చేసిన సేవలు, కృషి అభినందనీయమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. సోమవారం శ్యామలమ్మ మొదటి వర్ధంతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె తనయులు రామకృష్ణారెడ్డి, రవిశంకర్‌రెడ్డిలు ఎమ్మెల్యేకి స్వాగతం పలికారు. శ్యామలమ్మ లేని లోటు వైఎస్సార్‌సీపీకి తీర్చలేదన్నారు. శ్యామలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు వేమారెడ్డి, రెడ్డప్పరెడ్డి, రామశంకర్‌రెడ్డి, చలపతి, కరీముల్లా,మద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.





కనిపించే దేవుడు వైద్యుడు

– నేడు వైద్యుల దినోత్సవం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మనిషికి ఎంత సంపద ఉన్నా దాన్ని అనుభవించే ఆరోగ్యం లేకపోతే అదంతా వృథాయే. అనారోగ్యంతో బాధపడే వారిని ప్రమాద స్థితి నుంచి కాపాడే శక్తి కేవలం వైద్యునికే ఉంది. భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ వైద్య రంగం అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన వైద్య కల్పనకు విశేషమైన కృషి చేశారు. ఆయన సంస్మరణార్థం ప్రతి ఏటా ప్రభుత్వం జూలై 1వ తేదీన నేషనల్ డాక్టర్స్‌డే నిర్వహిస్తోంది. వైద్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు.



















